# ప్రజాశక్తి

గురువారం 10 ఏప్రిల్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా






# అక్షర వెలుగుపై నిర్లక్ష్యం

- వలంటీర్లకు భారంగా అక్షరాస్యతా కేంద్రాలు
- ఐదు నెలలుగా నిర్వహణ ఖర్చులు పెండింగ్
- బకాయి రూ.43.75 లక్షలు

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**

వయోజన అక్షరాస్యత కేంద్రాలను కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. నెలనెలా ఈ కేంద్రాలకు ఇవ్వాల్సిన కనీస నిర్వహణ ఖర్చులను ఇవ్వడం లేదు. ఐదు నెలలు పెండింగ్ పెట్టింది. దీంతో కేంద్రాల నిర్వహణ వలంటీర్లకు భారంగా మారింది. కృష్ణాజిల్లాలోని 875 మంది వలంటీర్లకు రూ.43.75 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆందోళన చెందుతున్నారు.

నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపుతామని చెబుతూ కూటమి ప్రభుత్వం అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్)ను తీసుకువచ్చింది. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో 25 మండలాల్లో స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా గ్రూపులు), మిడ్ డేమీల్స్ ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న 8,750 మందిని ఉల్లాస్‌లో శిక్షణకు ఎంపిక చేశారు. పది మందిని ఒక గ్రూపుగా ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల్లో చదువు చెప్పగలిగిన వారిని, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వివోఎ)లను ఒక్కో కేంద్రానికి ఒక్కో వలంటీర్‌ను ఎంపిక చేశారు. 875 మంది వలంటీర్లు ఐదు నెలలుగా ఆయా కేంద్రాల్లో సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గంటల మధ్యలో ప్రతి రోజు రెండు గంటలు నిరక్షరాస్య మహిళలకు అక్షరాలు నేర్పుతున్నారు. ఆర్థిక, సామాజిక అంశాలతో పాటు డిజిటల్ అక్షరాస్యతపైన (బ్యాంకు లావాదేవీల నిర్వహణ) తదితర ఎనిమిది అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.



మూడు సంవత్సరాల పాటు ఈ శిక్షణ కొనసాగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**కేంద్రాల నిర్వహణకు విడుదలవ్వని నిధులు**

అక్షరాస్యత కేంద్రాల్లో కరెంటు బిల్లులు, బోధనకు అవసరాల ఖర్చులకు కేంద్రం నెలకు రూ.వెయ్యి విడుదల చేయాల్సి ఉంది. ఐదు నెలలుగా కేంద్రం నిధులు విడుదల చేయలేదు. రూ.43.75 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అక్షరాస్యత కేంద్రాల నిర్వహణ ఖర్చులు తామే మోయాల్సి వస్తోందని వాలంటీర్లు వాపోతున్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

**ప్రజాశక్తి-విజయవాడ**

ఎన్‌టిఆర్ జిల్లాలో వర్షాలు, ఈదురుగాలులు, తెగుళ్లతో నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని రెడ్డిగూడెం, మైలవరం, తిరువూరు, గంపలగూడెం, జి.కొండూరు, విజయవాడ రూరల్, వీరులపాడు, కంచికచర్ల, నందిగామ తదితర మండలాల్లో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయని తెలిపారు. అయితే గత రెండేళ్లుగా తెగుళ్ల సోకి, ధరలు లేక, పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేక మామిడి తోటల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు మామిడి తోటలను నరికి వేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది కూడా పంటకు తెగుళ్ల సోకి తోటలన్నీ కూడా బాగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ దశలో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు ఇటీవల వచ్చిన అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా పండిన కొద్దిపాటి మామిడి కాయలు కూడా రాలిపోయాయని తెలిపారు. దీంతో రైతులు ఈ ఏడాది కూడా తీవ్రంగా నష్టాలు పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, తగిన పరిహారం చెల్లించాలని డి.వి.కృష్ణ డిమాండ్ చేశారు.

## సగటు వేతనం రూ.307

- 80 లక్షల పని దినాలే లక్ష్యం
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

**ప్రజాశక్తి-విజయవాడ**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో పని కల్పించడంలోనూ, సగటు దినసరి వేతనం రూ.307 వచ్చేలా చూడటంలోనూ నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డ్వామా అధికారులతో కలిసి ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, గ్రామాల వారీగా వేతనదారుల హాజరు, వారికి అందుతున్న వేతనం తదితరాల్లో పురోగతిని సమీక్షించారు. 2025-26కు జిల్లాలో 80 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించడం (మిగతా 2లో)


తొలగించిన ఆప్కాస్ కార్మికులను **విధుల్లోకి తీసుకోవాలి** 4లో

గ్యాస్ ధర పెంపుపై **సిపిఎం నిరసనలు** 6లో




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎంఎల్ఎ కుమార్‌రాజా

## స్వచ్ఛాంధ్రాలో భాగస్వామ్యం కావాలి

### కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

**ప్రజాశక్తి-మొవ్వ**

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ అన్నారు. మొవ్వలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో వ్యాపార దుకాణాల సముదాయానికి, డ్రైనేజీ, పనులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రామపంచాయతీ చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం సరిగా లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో గ్రామ సర్పంచ్ చొరవ తీసుకుని పంచాయతీ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గ్రామ పంచాయతీలో కోటి రూపాయల వరకు నిధులను సమకూర్చి అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయడం సంతోషదాయకమన్నారు. వర్షం పడితే గ్రామంలో నీరు నిలిచి ప్రజలంతా ఇబ్బంది పడే వారని, డ్రైనేజీ వ్యవస్థఏర్పాటుతో ఆ సమస్య తీరుతుందన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో ఎంతో ప్రాశస్త్యం ఉన్న కూచిపూడి నాట్యకళకు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జన్మస్థలమైన భట్లపెనుమర్రుకు మహర్దశ రాబోతుందన్నారు. కూచిపూడి ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఇ రమణరావు, ఈఈ సుధాకర్ గౌడ్, గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పిటిసి రాజులపాటి పార్వతి, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు వి పరిశుద్ధ రాజు, తహసిల్దారు మస్తాన్‌రావు, ఎంపీడీవో విమాదేవి పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

### ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

జిల్లా సమగ్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఉద్యోగులు, అధికారుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేసి ప్రభుత్వ లక్ష్యాలు నేరవేర్చడంలో భాగస్వామ్యం కావాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ అన్నారు. ఏపిఎన్‌జివో అసోసియేషన్ ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ నగర కార్యవర్గ సభ్యులు బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా శాఖకు నిర్వహించిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు డి. సత్యానారాయణరెడ్డి, సహా అధ్యక్షులు వి.వి.ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్‌లకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు అప్పగించిన లక్ష్యాలను సాధించడంలో మరింత కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న



ఏపిఎన్‌జివో అసోసియేషన్ ఎన్‌టిఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న కలెక్టర్

సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఏపిఎన్‌జివో ఎన్‌టిఆర్ జిల్లా నూతన అధ్యక్షులు డి.సత్యనారయణరెడ్డి మాట్లాడుతూ ప్రజా రంజక పాలన అందించడంలో వినూత్నశైలిని అవలంభిస్తూ రాష్ట్రంలోనే ఎన్‌టిఆర్ జిల్లాను మార్గదర్శకంగా నిలిపేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. దైనందిక విధులతో పాటు జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంకిత భావంతో సేవలు అందిస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా కలెక్టర్ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సతీష్ కుమార్, డి.విశ్వనాథ్, జి.రామకృష్ణ, బివి రమణ, వి.నాగార్జున, నగర కార్యవర్గ సభ్యులు కె.శివలీల, సివిఆర్ ప్రసాద్, ఎస్‌కె నజీర్ ఉద్దీన్, యం.శ్రీనివాసరావు, కాశీమ్ సాహేబ్, రాంబాబు, విజయశ్రీ, జి. వరప్రసాద్, టి.విద్యాసాగర్, కేశర గణేష్ పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం

## కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, సిపి రాజశేఖరబాబు

**ప్రజాశక్తి-విజయవాడ:** ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా, కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల రక్షణతో పాటు ఎస్‌సీ, ఎస్‌టీలపై వేధింపుల నిరోధక చట్టం-జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. అట్రాసిటీ కేసుల విచారణలో పురోగతి, బాధితులకు పరిహారం, క్షేత్రస్థాయిలో పౌర హక్కుల రక్షణకు తీసుకుంటున్న చర్యలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని.. చట్టం పటిష్ట అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరిహారం అందించేందుకు, కేసుల సత్వర విచారణలో ఎలాంటి అవరోధాలు ఎదురుకాకుండా చూడాలని, కులధ్రువీకరణ, మెడికల్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. 2022, ఏప్రిల్ 4 నుంచి ఇప్పటి వరకు చూస్తే తిరువూరు డివిజన్‌లో పది కేసుల్లో బాధితులకు రూ.10.75 లక్షలు, విజయవాడ డివిజన్‌లో 150 కేసుల్లో బాధితులకు రూ.1,78,21,250, నందిగామ డివిజన్‌లో 56 కేసుల్లో బాధితులకు రూ.65 లక్షలు మేర మొత్తం 216 కేసుల్లో దాదాపు రూ.2.54 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు కూడా క్రమంతప్పకుండా జరిగేలా ఆర్‌డీవోలు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు మాట్లాడుతూ 2023, డిసెంబర్ 21 నుంచి 2024, డిసెంబర్ 31 వరకు పశ్చిమ, దక్షిణ, ఉత్తర, మధ్య డివిజన్లతో పాటు నందిగామ డివిజన్, మైలవరం డివిజన్, మహిళా పీఎస్ పరిధిలో వేధింపుల నిరోధక చట్టానికి సంబంధించి 31 పెండింగ్ అండర్ ఇన్వెస్టిగేషన్, 30 పెండింగ్ ట్రయల్ కేసులు ఉన్నట్లు వివరించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీసీపీ కేజీవీ సరిత, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్‌డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## పురమిత్ర యాప్‌పై ప్రత్యేక దృష్టి

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడ నగర పాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ బుధవారం సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పురమిత్ర యాప్‌తో సిబ్బంది ప్రజలకు నుండి వచ్చిన సేవలకు వెంటనే స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు పురమిత్ర యాప్ గురించి అవగాహన కల్పించి వారికి పురమిత్ర యాప్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తెలియపరచాలని తెలిపారు. సచివాలయం సిబ్బంది ప్రతిరోజ తమ పరిధిలో గల సమస్యలను తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.



## దశలవారీగా అభివృద్ధి : లోకేష్

**ప్రజాశక్తి మంగళగిరి:** మంగళగిరి ఎస్‌ఎల్‌ఎన్ కాలనీలో అభివృద్ధి చేసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి పార్కు (ఎస్‌ఎల్‌ఎన్ పార్క్)ను మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. 0.35 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్కును రూ.1.06 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా లోకేష్ స్థానికులతో మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా పార్కులు, చెరువులను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని టిడ్కోపార్కును రూ.9 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను కూడా ఈనెలలోనే ప్రారంభిస్తామని చెప్పారు. నులకపేట, చినకాకానిలో లేక్ పార్కులను కూడా అభివృద్ధి చేసి వాకర్స్‌కి అందుబాటులోకి తెస్తామని లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ర్ ఎస్ ఆలీమ్ భాష, అడిషనల్ కమిషనర్ కే శకుంతల, ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు టి జానకి దేవి, రాష్ట్ర పద్మశాలి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ ల్యాబ్ ప్రారంభం

**ప్రజాశక్తి-చల్లపల్లి:** ఆంగ్లభాషపై పట్టు సాధించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మాజీ ఎంపీపీ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంక బాబు) కోరారు. స్థానిక శ్రీ విజయ అకాడమీలో ఏర్పాటు చేసిన నాంచారయ్య ఇంగ్లీష్ ల్యాబ్‌ను సోమశేఖర ప్రసాద్ (లంకబాబు) బుధవారం ప్రారంభించారు. అనంతరం నాంచారయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు వేములపల్లి వెంకట నాంచారయ్య జ్ఞాపకార్థం ల్యాబ్ ప్రారంభించడం అత్యంత ముదావహం అన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు ల్యాబ్ ను వినియోగించుకుని ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాంచారయ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయిలో అరుదుగా ఉండే ఇంగ్లీష్ ల్యాబ్ ను శ్రీ విజయ అకాడమీలో ఉన్నత ప్రమాణాలతో నూతన టెక్నాలజీ ఉపయోగించ ఇంగ్లీష్ ల్యాబ్ ను ప్రారంభించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని కరస్పాండెంట్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం కంఠంనేని కుటుంబరావు, గద్దే రఘురామారావు, ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## సగటు వేతనం రూ.307

జరిగిందని, ఈ నేపథ్యంలో గతేడాది గణాంకాల ఆధారంగా ఈ ఏడాది మండలాలు, రోజుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు 2,737 పంట కుంటల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించగా, 69 కుంటల నిర్మాణం వంద శాతం పూర్తయిందని, మరో 1,029 పంట కుంటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పంట కుంటలపై సచివాలయం స్థాయిలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వేసవిలో పశువులతో పాటు గొర్రెలు, మేకలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉపాధి హామీ పథకం అనుసంధానంతో నీటి తొట్టెలను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. పశు సంవర్ధక శాఖ 277 తొట్టెల పనులను గుర్తించి, పనులు చేపట్టడం జరిగిందని, మిగిలిన వాటికి సంబంధించిన పరిపాలనా అనుమతుల ప్రక్రియ ఈ నెల 12 నాటికి పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ఉద్యాన పంటల సాగుకు 2025-26లో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం 20 ఎకరాలను గుర్తించాలని, జిల్లా లక్ష్యం నాలుగు వేల ఎకరాలుగా ఉందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం నిరసన



మచిలీపట్నంలో...

**ప్రజాశక్తి మచిలీపట్నంఅర్బన్ :** వంటగ్యాస్ ధరల పెంచి సామాన్యుల పై భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే వంట గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని, వాణిజ్య వినియోగంలో ఉన్న గ్యాస్ సిలిండర్ల ధరల భారం కూడా సామాన్యులు పైన పడుతుందని సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయల రేటు పెంపుదలను వ్యతిరేకిస్తూ బుధవారం మచిలీపట్నం కోనేరు సెంటర్లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అమాంతం పడిపోతున్న, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచి ప్రజానీకంపై మరింత భారం వేస్తుందని, ఎక్సైజ్ డ్యూటీలు అదనంగా పెంచి తగ్గింపు లాభాలకు ప్రజలకు చేరనీయకుండా దొడ్డి దారిన దోచుకుంటుందని సిపిఎం నాయకులు ధ్వజమెత్తారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇంధనాలపై 9సార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, సిపిఎం నగర కమిటీ సభ్యులు సిహెచ్ జయరావు, టి చంద్రపాల్, ఎండి యూనస్, తమ్ము చాందిని దుర్గ, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ ధనుంజయ రావు,ఐద్వా నగర అధ్యక్షులు సిహెచ్. విజయలక్ష్మి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కంకిపాడు :** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై పెంచిన 50 రూపాయలు ధరను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పెనమలూరు మండలం పోరంకి సెంటర్లో ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పెనమలూరు మండలం కార్యదర్శి కాసిం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలన్నారు. పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపు తుందని అన్నారు. సిపిఎం నాయకులు మస్తావలి, పాపా రావు, పి సత్యనారాయణ, డి సింహాచలం, వెంకటరెడ్డి, ఐద్వా మహిళ సంఘం పెనమలూరు మండలం నాయకురాలు పుసులూరి పాతాళ లక్ష్మి పాల్గొన్నారు.


బంటుమిల్లిలో...



కంకిపాడులో...

**ప్రజాశక్తి-బంటుమిల్లి :** సిపిఎం బంటుమిల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్‌లో పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడుదారులకి దోసిపెట్టే విధంగా పరిపాలన సాగుతుందని అన్నారు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ గ్యాస్ ధరలు పెంచడానికి అర్థమేంటని ప్రశ్నించారు. మండల కమిటీ సభ్యులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు లంకదాసుల అజయ్ గోష్, పొదిలి వెంకన్న, బొడ్డు నాగరాజు, నావిశెట్టి కష్ణ పాల్గొన్నారు


విద్యుత్ చౌర్యంపై మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

## విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

**ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలంలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య, పరిశ్రమల సముదాయాలు, ఆక్వా సర్వీసులపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాసు మచిలీపట్నం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవిందరావు ఆధ్వర్యంలో 34 బందాలుగా ఏర్పడి 1948 గృహ సర్వీసులు, 253 వాణిజ్య సర్వీసులు, 143 ఆక్వా సర్వీసులు 8 పరిశ్రమల సర్వీసులు, మొత్తం-2322 సర్వీసులను తనిఖీ చేసి వారికి రూ.10,55,400 అపరాధ రుసుము విధించినట్లు తెలి పారు. విద్యుత్ సౌర్యం చట్టరిత్య నేరం, విద్యుత్ సౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు

## ల్యాప్‌టాప్ బహూకరణ




**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి పారిశ్రామి కవేత్త అప్పికట్ల అప్పారావు ల్యాప్‌టాప్ బహు కరించారు. బుధవారం అప్పారావు సోదరుడు నాగ వీరాంజ నేయులు సీఐ కార్యాలయానికి వచ్చి సీఐ యువకుమారుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట సోమశేఖర్, కోడూరు మండల జనసేన ఉపాధ్యక్షుడు చందు తదితరులు పాల్గొన్నారు.

## శాంపిల్స్ సేకరణ

**ప్రజాశక్తి-ఉయ్యూరు :** పొలంలో నాటడం నుండి విత్తనం తయారుచేసుకునే వరకు నిర్దేశించిన సాగు సూత్రాలు పాటిస్తేనే ఇండి- గ్యాప్ పొలంబడికి ధవీకరణ పత్రం మంజూరు చేయబడుతుందని ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధవీకరణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ ఇన్స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ అహ్మద్ అన్నారు. చినఓగిరాలలో బుధవారం విజిటబుల్స్, పల్సెస్ ఫార్మర్ ప్రొడ్యూ సర్ కంపెనీకి చెందిన 15 మంది రైతుల పంట శాంపిల్స్ తీసుకుని 267 ప్యారామీటర్ల పరీక్ష నిమిత్తం బెంగుళూరు పంపిస్తున్నట్టు తెలిపారు. శాంపిల్స్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉంటే ఒక సంవత్సరం వ్యాలిడిటీతో ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల ధవీకరణ సంస్థ ద్వారా ధవీకరణ పత్రం ఇస్తామని తద్వారా రైతుకు ఆ రోగ్యం, ఆదాయం చేకూరుతుందన్నారు. గన్నవరం ఏడీఏ ఎం సునీల్, ఏఓ నిస్సిగ్రేస్, ఏఈఓ సునీల్ గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నవజీవన్ విద్యాసంస్థల అధినేత కొండవీటి ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగతంగా సామాజికంగా పర్యావరణ హితముగా విద్యార్థులు పాటించవలసిన విలువల గురించి వివరించారు. విద్యార్థులు సమున్నత విలువలతో మంచి సమాజాన్ని నిర్మించడంలో భాగస్వా ములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని వినతి

**ప్రజాశక్తి-కంకిపాడు :** ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని, రద్దు చేసినట్లయితే కార్మికులు అందర్నీ పర్మినెంట్ చేయాలని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తాడిగడప మున్సిపాలిటీ కార్మికులు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ కార్మికులకు తాడిగడప మున్సిపాలిటీలో రెండు సమస్యలు పెండింగ్లో ఉన్నాయని ఒకటి హెల్త్ అలవెన్సు ప్రతి కార్మికుడికి ఆరు వేల రూపాయలు రావాల్సి ఉందన్నారు. అలాగే కొంతమంది కార్మికులకు సమ్మె కాలంలో జీతం ఇవ్వమని ప్రభుత్వం జీవో ఇచ్చినా నేటికీ జీతాలు ఇవ్వలేదని అన్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయొద్దని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని అన్నారు. మిగిలిన సమస్యలు కూడా కమిషనర్‌తో మాట్లాడి పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు అధ్యక్షురాలు వై సరళ, తాడిగడప మున్సిపాలిటీ సిఐటియు కార్యదర్శి మదిర ఏడుకొండలు, కోశాధికారి రత్నాకరుణ, తాడిగడప సిఐటియు నాయకులు మస్తాన్వలి, బిక్షాలు పాల్గొన్నారు.




డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## ఎఎన్‌ఎంల ప్రమోషన్లు పూర్తి చేయాలని వినతి

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో గ్రేడ్ 3, సచివాలయ ఏఎన్ఎం నుండి ఎంపిహెచ్ఎ (ఎఫ్) పదోన్నతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఏపీ ఎన్ జి ఓ స్,అసోసియేషన్ సంఘ నాయకులు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.శర్మిష్ఠ ను కలసి విజ్ఞప్తి చేశారు. సినియరటి జాబితా ప్రకటించి పది రోజులు దాటి పోతున్న ఇప్పటి వరకు పదోన్నతుల ప్రక్రియ చేయకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాలో ప్రక్రియ పూర్తి అయ్యిందని ఆలస్యం అయ్యే కొద్ది సినియార్టి లో వెనుకబడి పోతామని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని కాబట్టి వెంటనే అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలసిన వారిలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సత్యన్నారాయణ రెడ్డి, రమేష్ తూర్పు కష్ణా అధ్యక్షులు ఆకూరి శ్రీనివాసరావు , విజయవాడ నగర అధ్యక్షులు సి వి ఆర్ ప్రసాద్ , ఉయ్యూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు పలువురు సంఘ నాయకులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ఉమ్మడి జిల్లాలో 39 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పిస్తూ జిల్లా కలెక్టర్ డి కె.బాలాజీ బుధవారం ఉత్తర్వులు అందించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామ పంచాయతీలో గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా ప్రస్తుతం కృష్ణాజిల్లాకు కేటాయింపు చేసి 39 మందికి పదోన్నతుల ఉత్తర్వులను, కారుణ్య నియామకం కింద ముగ్గురకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జే అరుణ, ఏవో వి.సీతారామయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు .


పదోన్నతులు పొందిన వారితో కలెక్టర్ బాలాజీ



## భోజనశాలకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-మొవ్వ :** పీఎంశ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ విద్యార్థులకు 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే భోజనశాలకు డాక్టర్ తాతినేని గోపాలరావు బీనాదేవి దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. భోజనశాల నిర్మించుటకు ముందుకు వచ్చిన డాక్టర్ తాతినేని గోపాలరావు, బీనా దేవి దంపతుల ఇరువురిని పాఠశాల ఫుల్ ఎడిషనల్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయుని సూర్యదేవర శ్రీదేవి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గురివింద పల్లి బాబురావు, పాఠశాల విద్యా కుటుంబం గ్రామ పెద్దలు అభినందించారు.

## సుబ్బారావుకు ఘన నివాళి

**ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు గ్రామపంచాయతీ పరిధిలో దింటిమెరక గ్రామానికి చెందిన వేములపల్లి సుబ్బారావు కుటుంబ సభ్యులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పరామర్శించారు. గత కొద్దిరోజులు క్రితం సుబ్బారావు మృతి చెందగా బుధవారం వారి స్వగృహం వద్ద ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఎమ్మెల్యే నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈకార్యక్రమంలో వేములపల్లి వాసు, వేములపల్లి రాజేష్, పమిడిముక్కల పాండురంగారావు, జొన్నలగడ్డ గోపాలరావు ఉన్నారు.

## తాగునీటికి లింగగూడెం వాసుల ఇక్కట్లు

**ప్రజాశక్తి - వత్సవాయి :** అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అని అన్నట్లు ఉంది లింగగూడెం గ్రామ ప్రజల పరిస్థితి. మండలంలోని లింగగూడెం గ్రామంలో గత వారం రోజులుగా తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టించుకునే అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొనేటిలో నీళ్లు ఉన్నాయి, విద్యుత్ సరఫరా, మోటర్లు, పైపులైన్లు అన్ని సక్రంగానే ఉన్నాయి కానీ..... మంచి నీళ్లు వదిలే ఆపరేటర్ (పిట్టర్) లేరని అందువల్ల గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయిందని కొంతమంది అధికారులు తెలుపుతున్నారు. అసలే వేసవికాలం కావడంతో గ్రామంలోని బోర్లన్నీ అడుగంటిపోయాయి. దీంతో ఇటు బోర్లు లేక అటు పంచాయతీ వాటర్ రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బోరు బావులు మినరల్ వాటర్, వ్యవసాయ బావుల్లో నీరు తాగుతున్నారు. దీంతో వారు జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సరఫరాను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ప్రజా దర్బార్‌కు స్పందన

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని స్థానిక ఉక్కు కళావేదికలో బుధవారం పట్టణ ప్రజల సమస్యల పరిష్కార నిమిత్తం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్‌లో మొత్తం 174 అర్జీలు వచ్చాయని, 70 అప్లికేషన్లు రెవెన్యూ విభాగం, 75 అప్లికేషన్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, 10 అప్లికేషన్లు ఎలక్ట్రిసిటీ, మిగతా అప్లికేషన్లు హౌసింగ్, పోలీస్ ఆర్ అండ్ బి ఇరిగేషన్ విభాగాల్లో ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కృష్ణా మిల్క్ యూనియన్‌పై అసత్య ఆరోపణలు నమ్మొద్దు'

**ప్రజాశక్తి జగ్గయ్యపేట:** 60 ఏళ్లుగా ఉన్నత విలువలతో పాడి రైతుల ఆర్థిక అభివద్ధి, ఉద్యోగులకు సంపూర్ణ భద్రత, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్న సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్ అని యూనియన్ పాలకవర్గ సభ్యులు చెరుకూరి లవయ్య, ట్రస్ట్ సభ్యులు ఇంజం రామారావు అన్నారు. బుధవారం మండలంలోని చిల్లకల్లు పాల శీతల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల కేంద్రాల అభ్యున్నతికి ఆంజనేయులు చేస్తున్న కృషిని చూసి తట్టుకోలేక అటువంటి యూనియన్ పై రెండు రోజులుగా సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం అవుతున్న అసత్య వీడియో సందేశాలు, ఒక పత్రికలో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాల కేంద్రాల అభ్యున్నతికి ఆంజనేయులు చేస్తున్న కషిని చూసి తట్టుకోలేక కొందరు ఆయనపై అపవాదులు వేస్తున్నారన్నారు, సమితి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నంలను ఖండిస్తూ ఈ అసత్య ప్రచారాలపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు పాలశీతల కేంద్ర పరిధిలోని సంఘ అధ్యక్షులు పాల్గొన్నారు.

## పౌష్టికాహార పక్షోత్సవాలు

**ప్రజాశక్తి - వత్సవాయి :** 1000 కేర్ అంటే 1000 రోజుల సంరక్షణ అంటే ఒక స్త్రీ గర్భం దాల్చిన దగ్గరనుంచి బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చేవరకు తీసుకున్న సంరక్షణ 1000 రోజులు సంరక్షణ అని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీ భార్గవి అన్నారు మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగమణి ఆధ్వర్యంలో అంగన్వాడీ సెంటర్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడో పౌష్టికాహార వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులకు బాలింతలకు, పిల్లతల్లులకు, పెద్దలకు తీసుకోవలసిన పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సూపర్వైజర్ ఉషారాణి ఎమ్మెస్ కేలు ఆశా వర్కర్లు ఏఎన్ఎంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విఒఎ, ఎన్యుమరేటర్లకు శిక్షణ

**ప్రజాశక్తి - మైలవరం :** విఒఎలు, ఎన్యుమరేటర్లకు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ ప్రావర్టీ (ఎస్‌సిఆర్‌పి) క్రెడిట్ అండ్ లవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్ గురించి మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక ఎపిఒ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎపిఒ ఎం.శామ్యూల్ మాట్లాడుతూ గ్రూపుల్లో ఉన్న ప్రతి సభ్యులకు వారు జీవనోపాధులు ఏర్పాటు చేసుకొనేందుకు వారికి ఎంత అమౌంట్ కావాలి ఏ నెలలో కావాలి పిల్లల చదువులకు వ్యవసాయ అవసరాలకు పాడి గేదెలకు ఇంటి నిర్మాణం తదితర అవసరాల నిమిత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రూపు సభ్యులు పెట్టుకొనుటకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 614 గ్రూపులలో 8330 మందికి సర్వే చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విఒఎలు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

# తొలగించిన ఆప్కాస్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

### నిరసనలో దోనేపూడి కాశీనాథ్ డిమాండ్



నిరసన తెలుపుతున్న బాధితులు

**ప్రజాశక్తి - విజయవాడ :** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ఆప్కాస్ పారిశుధ్య కార్మికుల్లో 60 సంవత్సరాలు వయస్సు దాటిందనే సాకుతో తొలగించిన 65 మంది కార్మికులను వెంటనే పనిలోకి పెట్టుకోవాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. తొలగించిన ఆప్కాస్ కార్మికులను తిరిగి పనిలోకి పెట్టుకోవాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలో బుధవారం బాధిత కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆప్కాస్ కార్మికులను పనిలో పెట్టుకోవాలని, అధికారుల వైఖరి నశించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికులు నినాదాలు చేశారు. కాశీనాథ్ మాట్లాడుతూ తొలగించిన ఆప్కాస్ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండాయనే సాకుతో కార్మికులను పనిలో నుంచి తొలగించడం దారుణమని, కొందరు కార్మికుల వాస్తవ వయసుకు, ఆధార్‌కార్డుల్లోని వయస్సుకు వ్యత్యాసం ఉందని అన్నారు. 60 సంవత్సరాలు నిండినప్పటికీ కార్మికుల్లో పని చేయకల్గిన శక్తి, సామార్ధ్యం, అనుభవం ఉందని అటువంటి కార్మికులను తొలగించడం వలన శానిటేషన్ పని నగరంలో కుంటుపడుతుందని అన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కొనసాగించాలని, ఆప్కాస్ కార్మికులకు గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ఇప్పటికయినా ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పంద జీవో కాపీలు వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులిచ్చిన వినతిపత్రంపై ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్స్‌ను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా తన వంతుగా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.జ్యోతి బస్, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నగర ఉపాధ్యక్షురాలు టి.తిరపతమ్మ నాయకులు సేలం దాసు, వి.సాంబులు, కృష్ణవేణి, బాధిత కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సిపిఎం వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాగమణి, తదితరులు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** ప్రజా సమస్యలు పరిష్కారానికై పట్టణంలోని ఉక్కు కళావేదికలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు పట్టణంలోని టీట్కో ఇండ్లను లబ్ధిదారులకు అందజేయాలని, పట్టణంలో మెయిన్ రోడ్లపై ఉన్న వైన్‌షాపులను తొలగించాలని, పట్టణంలో కోతులు, కుక్కల బెడద విపరీతంగా ఉందని, తొర్రగుంటపాలెంలో మున్సిపల్ పైపులు ఏర్పాటు చేయాలని పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లో గల కెమికల్ ఫ్యాక్టరీ నుండి వచ్చే కాలుష్యంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అటువంటి ఫ్యాక్టరీలను రద్దు చేయాలని పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని లబ్ధిదారులకు, మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని కోరారు. జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పాశుద్ధ్య కార్మికులు గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని 11 మంది చేసే పనిని ఆరుగురుతో చేయించడం వలన పని భారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రావెళ్ల నాగ శేషు, వివి రాంప్రసాద్, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల రాజేశ్వరి, కాకనబోయిన లింగారావు, షేక్ గౌస్ మియా, షేక్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్ ద్వారా ధాన్యం విక్రయం ఇలా...

**విజయవాడ :** రైతులు వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించేందుకు అవసరమైన సూచనలను సంబంధిత అధికారులు తెలిపారు. ముందుగా తమ ఫోన్‌లో 73373 59375 నెంబర్ సేవ్ చేసుకోవాలి. ఆ నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెట్టాలి. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు స్వాగతం ధాన్యం అమ్మడానికి షెడ్యూల్ చేసుకోండి' అనే మెసేజ్ కనిపిస్తుంది. ఇందులో షెడ్యూల్‌పై క్లిక్ చేయండి. 'దయచేసి మీ ఆధార్ సంఖ్యను నమోదు చేయండి' అనే మెసేజ్ వస్తుంది. రైతు తన ఆధార్ నెంబర్‌ను టైప్ చేయాలి. ఆ ఆధార్ నెంబర్ కలిగిన రైతు పేరు, ధాన్యం అమ్మే కొనుగోలు కేంద్రం పేరు స్క్రీన్‌పై కనిపిస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రంపై క్లిక్ చేయగానే... ధాన్యం అమ్మే తేదీని ఎంచుకోండి అనే మెసేజ్ కనిపిస్తుంది. నచ్చిన తేదీపై క్లిక్ చేయండి. అనంతరం ధాన్యం అమ్మే సమయాన్ని ఎంచుకోవాలి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మూడు స్లాట్‌లు ఉంటాయి. ఇందులో ఉదాహరణకు ఉదయం 8 నుంచి 10 గంటల స్లాట్ ఎంచుకుంటే... ఇందులో 8,9,10 గంటల స్లాట్ ఏదో ఒక సమయాన్ని నిర్ధారించుకోవాలి. సమయాన్ని ఎంచుకున్న తర్వాత రైతు ఏ ధాన్యం అమ్ముతున్నారో తెలిపాలి. కామన్ సార్టెక్స్, కామన్ నాన్ సార్టెక్స్, ఇలా మీ ప్రాంతానికి సంబంధించిన రకాలు కనిపిస్తాయి. రైతు ప్రభుత్వానికి అమ్మదలచిన ధాన్యాన్ని బ్యాగ్‌ల సంఖ్య తెలపాలి. బ్యాగ్ సంఖ్య తెలపగానే రైతు పేరు, ఏ కేంద్రంలో, ఏ తేదీన ఏ స్లాట్‌లో ఏ సమయానికి ఎన్ని బ్యాగ్‌ల ధాన్యం కొనుగోలు వివరాలు డిస్‌ప్లే అవుతాయి. కూపన్ కోడ్ వస్తుంది. ఏఐ వాయిస్ ఓవర్‌తో రైతులను గైడ్ చేస్తూ వాట్సాప్‌లో సులభంగా ధాన్యం కొనుగోలు షెడ్యూల్ చేసేందుకు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేసింది.

## వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

**ప్రజాశక్తి - ఏ.కొండూరు :** ఇటీవల వచ్చిన గాలి దుమ్ము వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, చీమలపాడు తదితర గ్రామాలు అకాల వర్షానికి



దెబ్బతిన్న పంటలను అయన రైతులతో కలిసి పరిశీలించారు. రామచంద్రాపురం గ్రామంలో గర్నేపూడి నరసయ్య అనే రైతు మూడు ఎకరాల 50 సెంట్లు బొప్పాయి తోట వేసి ఎకరాకు రూ.లక్ష ఇరవై వేలు పెట్టుబడి పెట్టాడు. తీరా పంట చేతికొచ్చే దశలో తోటంతా పూర్తిగా గాలి దుమ్ముకు పూర్తిగా పడిపోయిందని ఆ రైతు నాయకుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సుమారుగా 400 ఎకరాలు మొక్కజొన్న పూర్తిగా నేలకొరిగిందని, 100 ఎకరాలకు పైగా బొప్పాయి తోటలు పూర్తిగా విరిగిపడి పోయాయని, మామిడి కాయలు నేలకొరిగాయి. రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బొప్పాయికి ఎకరానికి రూ.లక్ష, మొక్కజొన్నకు రూ.50 వేలు, మామిడికి ఎకరానికి రూ.50 వేలు నష్టపరి హారం చెల్లించాలని అమ్మిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని వ్యవసాయ శాఖ అధికాలుకు అగ్రికల్చర్ ఎడిఎ అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, సూరెడ్డి పిచ్చేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, తుళ్లూరు లక్ష్మయ్య, దోబ గుంట్ల కిషోర్, నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** ఇంద్రకీలాద్రిపై కూచిపూడి నృత్య ప్రదర్శనలు బుధవారం ఆకట్టుకున్నాయి. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ధర్మపదం కార్యక్రమంలో ప్రణవం డాన్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నది. కుమారి ఎం.ప్రణతి ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీకరి, వర్ణిక, స్యాన్వి, బాన్విత, భవిష్య, తదితర చిన్నారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. దేవస్థానం అధికారులు చిన్నారులకు తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు.

## 15 నుండి కర్నాటకకు లారీలు నిలుపుదల

**విజయవాడ :** ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక స్టేట్ లారీ ఓనర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుండి ట్రాన్స్‌పోర్ట్ కార్యకలాపాల విరమణకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వారికి మద్దతుగా ఎపిలోని లారీలను కర్ణాటకకు పంపకుండా సహకరించాలని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ ఆసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. కర్ణాటక రవాణా సోదరుల నిరసనకు ఆలిండియా మోటార్ ట్రాన్స్ పోర్ట్ కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్లు సౌత్ జోన్ ఉపాధ్యక్షులైన ఈశ్వరరావు ప్రకటించారు.

## అన్నదానం

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** విజయవాడ వన్‌టౌన్ బ్రాహ్మణ వీధి, కొత్తపేటలో ఉన్న శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల కళ్యాణ ఉత్సవం సందర్భంగా బుధవారం సుమారు 2వేల మందికి కొత్తపేట బ్రహ్మణ వీధి రామాలయం వద్ద ఉన్న కళ్యాణ్ మండపంలో యాత్రికులకు అన్న ప్రసాదం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ వారు, అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతురావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (న్యాయవాది), శీరం వెంకట్రావు, కొరగంజి భాస్కరరావు, బెవర శ్రీనివాసరావు, మజ్జి శ్రీను, కామందుల నరసింహారావు, ఫణుకు రమా, పిల్లా విజయ్, బెవర సాయి సుధాకర్, పోతిన ధర్మారావు, పోతిన శ్రీనివాసరావు, దేవస్థానం స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ రహిత నగరానికి సహకరించాలి

**విజయవాడ :** విజయవాడ నగరం పోస్టర్ రహిత నగరం అయినందున బహిరంగంగా బ్యానర్లు పోస్టర్లు ఫ్లెక్సీలు అతికించడం నిషేధమనినగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ తెలిపారు. నగరంలో ప్రజారోగ్యం, పర్యావరణ పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని, నగర సుందరీకరణను కాపాడేందుకు నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ప్రహరీ గోడలు,ట్రాఫిక్ డివైడర్లు, కరెంటు పోల్స్, ట్రాఫిక్ ఇలాండ్స్, ఫ్లైఓవర్లు, బ్రిడ్జిలు తదితర ప్రాంతాల్లో పోస్టర్లను అతికించటం నిషేధమని తెలిపారు. వాల్‌పోస్టర్లను నగరంలో ఎక్కడైనా అతికిస్తే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకటన దారులు, ప్రింటింగ్ ప్రెస్‌వారి నుండి రూ.లక్ష వరకు పెనాల్టీ, పోస్టర్లు అంటించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.



## పనులు ఆపండి..

● ఎంఎల్ఎ కార్యాలయం నుంచి హుకుం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం అల్లాపురం పంచాయతీలో మండల పరిషత్ నిధులు 10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు హఠాత్తుగా నిలిపివేశారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పనులు ఆపేయండి అని ఫోన్ వచ్చినట్లుగా తెలిసింది. మండల పరిషత్ ఇన్చార్జి ఎంపిపీ కొమ్మరాజు సుధీర్ ఆ గ్రామ ఎంపీటీసీ కోరిక మేరకు పది లక్షల డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సదరు పనులకు టిడిపి మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. అయితే ఎమ్మెల్యే శంకుస్థాపన చేయకుండా పనులు చేపట్టడం ఏంటని కార్యాలయం నుంచి పంచాయతీకి ఫోన్ వచ్చింది. అంతే డ్రైనేజీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఎమ్మెల్యే వచ్చి కొబ్బరికాయ కొట్టిన తర్వాత కానీ ఈ పనులు ప్రారంభం కావని పంచాయతీ వార్డు సభ్యులు చెబుతున్నారు.



## ఉషారామాలో ఎక్స్పో-2025

ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రాజెక్టు ఎక్స్పోలు దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి కె ఎస్ వి ప్రసాద్ అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పో 2025 ని బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను మొత్తం 72 గ్రూపులుగా విభజించి గేమింగ్,ఐఒటి, ఎంఎల్ అండ్ ఎఐ మీద ప్రాజెక్టులు రూపొందించి వేదిక మీద ఏర్పాటు చేసి ప్రాజెక్ట్ ఎక్స్పో నిర్వహించడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని తెలుసుకోవచ్చన్నారు. ప్రాజెక్టులను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్ సి విభాగాధిపతి డాక్టర్ ఎం ఎం రాయ్ చౌదరి, విభాగాధిపతి డాక్టర్ కె.పి.ఎన్.వి సత్య శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలి

● ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్‌బాబు




ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రపంచ ప్రజాస్వామిక దేశాల్లో భారత రాజ్యాంగం విశిష్టమైనదని ఎల్ఐసి ఆఫ్ ఇండియా, మచిలీపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి. సుధాకర్ బాబు పేర్కొన్నారు. అటువంటి గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం-ఒక సజీవ పత్రం'పై మచిలీ పట్నంలో బుధవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ అనేక దేశాల రాజ్యాంగాలు అధ్యయనం చేసి, మన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేట్లు భారత రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి, జి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు వాక్ స్వాతంత్ర్యం, మతాన్ని ఆచరించుకునే స్వేచ్ఛ, యూనియన్లు ఏర్పరచుకునే హక్కు, సమానత్వాన్ని అందించిందని తెలిపారు. రాజ్యాంగం ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా రూపొందించ బడిందన్నారు. ప్రస్తుత పాలకుల విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. చదువుకున్నవారు ఈ ప్రమాదకర ధోరణులపట్ల అప్రమత్తంగా ఉండాలని, రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐసిఇయు అధ్యక్షులు జె.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐసిఆర్ఇఎ నాయకులు, పి.నాగయ్య, క్లాస్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు, రజనీకాంత్, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు, ఉమా మహేశ్వరరావు, ఎల్ఐసి ఎస్.సి, ఎస్.టి అసోసియేషన్ నాయకులు, కె.బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-ఘంటసాల : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం ఘంటసాల గ్రామంలోని మల్లంపల్లి రోడ్డులో ఉన్న రాఫా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వద్ద పర్ణశాల ప్రార్థనా మందిరం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి గ్రామాలలో పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. షామియానా బాషా, పాస్టర్ రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




మజ్జిగ అందజేస్తున్న డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్

## అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి- మొవ్వ : మొవ్వ మండలంలోని కోసూరు ఎస్ టి కాలనీలో జనవరి 31వ తేదీన గ్యాస్ బండ పేలి ఆరు గృహాలు పూర్తిగా కాలిపోయినాయి. సిపిఎం మొవ్వ మండల కమిటీ నాయకులు ఉయ్యూరులో ఉన్న ఉష డిజైనర్స్ స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి ఇళ్లు కాలిపోయిన ఆరు కుటుంబాల వారికి 16 వేల రూపాయల విలువ గల గ్యాస్ పొయ్యిలు, రెగ్యులేటర్లు, గ్యాస్ పైపులు, దుప్పట్లు, చీరలు మండల తహశీల్దార్ కె మస్తాన్, ఆర్ ఐ విజయదుర్గ, స్పాన్సర్స్ ఆలపాటి ఉషారాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉష డిజైనర్స్ ఆలపాటి ఉషారాణి, కంభంపాటి ఝాన్సీరాణి, జస్మిత చౌదరి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాడంకి నరేష్, సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మండల కమిటీ సభ్యులు కొడాలి కరుణాకరరావు, మండల నాయకులు కొడాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

## చుక్కా రామయ్య ఐఐటి గ్రాండ్ టెస్టులో 'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఈనెల 8వ తేదీన జరిగిన చుక్కా రామయ్య ఐఐటి గ్రాండ్ టెస్టులో త్రివేణి ఇంగ్లీషు మీడియం విద్యార్థులు 6వ,7వ తరగతిలో ప్రభంజనం సృష్టించినట్లు స్కూల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శివశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక జగన్నాథపురంలోని త్రివేణి ఇంగ్లీషు మీడియం పాఠశాల ఐఐటి టెస్టులో బహు మతులు సాధించిన విద్యార్థులను అభినందించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ గ్రాండ్ టెస్టులో 6వ తరగతిలో ప్రథమ బహుమతి ఒకరికి, ద్వితీయ బహుతులు ఐదుగురికి, తృతీయ బహుమతులు నలుగురికి, 7వ తరగతికి చెందిన ప్రథమ బహుమతులు ఐదుగురు, ద్వితీయ బహుతులు నలుగురు విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులకు మంచి బహుమతులు రావడం గర్వకారణమన్నారు. ఏ విభాగంలో పోటీలు జరిగినా తమ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలవడం పాఠశాల ప్రతిభకు నిదర్శనమన్నారు. ఇంతటి విజయానికి కారణమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది కృషిని ఆయన అభినందించారు.

## ఆర్ఐగా బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ గా జి హనుమంతరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నందివాడ మండలం రెవిన్యూ కార్యాలయం నుండి బదిలీపై గుడ్లవల్లేరు ఆర్ఐగా బాధ్యతలు చేపట్టినట్లు తాసిల్దార్ బి లోకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని బుద్ధవరం పంచాయతీలో చెత్త, పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో సరోజిని తెలిపారు. బుధవారం ఆమె గ్రామంలో పర్యటించి డ్రైనేజీల్లో పూడికతీత పనులు కార్మికులతో చేయించారు. చెత్త కుప్పలను తొలగించారు. మరుగు సమస్య ఎక్కడ ఉన్నా తక్షణమే నియంత్రణకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నట్లు చెప్పారు. దావాజీ గూడెం, రాజీవ్ కాలనీ, బుద్ధవరం ఏరియాలో పనులు వేగంగా తిరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ముస్తాబాద్ గ్రామపంచాయతీలో చెత్త లేకుండా చూస్తున్నట్లు ఈవో శ్రీనివాస్ చెప్పారు. మురుగు కాలవల్లో కూడా పూడికలు తీస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామంలో చెత్త పరవేయడానికి డంపింగ్ యార్డ్ కావలసిన అవసరం ఉందన్నారు. క్వారీ గోతులు ఉన్నాయని వాటిని కేటాయిస్తే చెత్త డంపింగ్ వీలుటుందని చెప్పారు. కేసరపల్లి పంచాయతీలో సర్పంచ్ లక్ష్మీ మౌనిక ఆధ్వర్యంలో పారిశుధ్య అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని ఈవో ప్రసాద్ చెప్పారు.

## క్రీడా స్థలం పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని అధికారులు బుధవారం పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో బాస్కెట్ బాల్ కోర్ట్ నిర్మాణానికి, మరుగుదొడ్ల ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని చూశారు. కృష్ణా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి ఝాన్సీ లక్ష్మి, శాప్ ఏ.ఇ ప్రశాంత్ , పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జి వి రవి బాబు, వ్యాయామ విద్యా సహాయకులు, ధనియాల నాగరాజు, రిటైర్డ్ పి.డి లు టి యస్ ఆర్ కే ప్రసాద్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు. అలాగే ఉంగుటూరు మండలం ఆత్కూర్ జడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్టేడియంను కూడా వీరు పరిశీలించారు.

# ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని వినతి



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కల్కర్రేట్ (కృష్ణా) : జిల్లాలో అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ ప్రమోషన్స్‌లో అవకాశం కల్పించాలని కోరుతూ యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావుకి వినతి పత్రం అందజేశారు.ఇటీవల విద్యాశాఖ కార్యాలయం నుండి విడుదల చేసిన సీనియారిటీ జాబితాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, స్కూల్ అసిస్టెంట్ హిందీకు అర్హతలు కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పేర్లు లేవన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఏ జీవో ప్రకారం ఎస్జీటీలను ఈ జాబితాలలో చేర్చలేదన్నారు.ఈ సీనియార్టీ లిస్టు తయారు చేయటానికి ఉన్న నిబంధనలు కాపీ, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, స్కూల్ అసిస్టెంట్ హిందీ వారికి కామన్ సీనియారిటీ తయారు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల కాపీ ఇప్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కె ఎ ఉమా మహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి షౌకత్ హుస్సేన్, బి కనకారావు, గౌరవాధ్యక్షులు జె లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శులు ఎల్ నరేంద్ర, అబ్దుల్ హబీబ్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు ఉన్నారు.

## బంగారయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాలకు చెందిన ఎన్నారై, ఘంటసాల డాట్ నెట్ నిర్వాహకులు, రచయిత వేమూరి రాజేష్ తండ్రి రామచంద్రరావు (బంగారయ్య) గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. రామచంద్రరావు కుమారుడు ఎన్నారై వేమూరి రాజేష్ ను, వారి కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పలువురు కూటమి నాయకులతో కలిసి పరామర్శించారు. రామచంద్ర రావు చిత్రపటానికి పలువురు కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

# గ్యాస్ ధర పెంపుపై సిపిఎం నిరసనలు




ఇబ్రహీంపట్నంలో ఆందోళన




తిరువూరులో...

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** గ్యాస్‌పై రూ.50లు, పెట్రోల్, డీజిల్‌పై రూ.2లు ధర పెంచడంపై సిపిఎం మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గ్యాస్ బండ, కట్టెలు పెట్టి వంట చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల పట్టణ కార్యదర్శి ఎస్.నాగమణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలపై పెను భారాలు మోపుతుందన్నారు. గ్యాస్ బండపై ఎన్నడూ లేని విధంగా రూ.50లు పెంచడం, డీజిల్, పెట్రోల్ పై 2 రూపాయల పెంచడం దారుణమన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రావెళ్ల నాగేషు, వివి రాంప్రసాద్, కోటా కృష్ణ పాల్గొన్నారు.

**తిరువూరు :** సిపిఎం తిరువూరు మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి గ్రామంలో ఆందోళన చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్నా వ్యవసాయ కూలీలకు గ్యాస్ ధర పెంపు మూలిగే నక్కపై తాటికాయపడ్డట్లుగా ఉందని సిపిఎం మండల మాజీ కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి రాచబంటి నరసింహారావు, ముత్తమ్మ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో కొండపల్లి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన కరెంట్ ఛార్జీలు, ఇంటి పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే ములిగే నక్కపై తాటికాయ పడిన చందంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ల ధర రూ.50లు పెంచటం మరో పక్క పెట్రోల్ డీజిల్ ధరలు లీటరుకు రూ.2 పెంచటం ప్రజలపై అధిక భారాలు వేయటం దుర్మార్గం అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధర తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎ.విఠల్‌రావు, ఇ.కొండలరావు, ఎల్.పార్వతి, కె.బేబీ, హాకర్స్ శాఖ కార్యదర్శి జి.రమణమ్మ, పార్టీ సభ్యులు రామారావు, అంజలి, లైలా, కుమారి, చిన్న, శర్మ పాల్గొన్నారు.

## ఒసి, బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**ప్రజాశక్తి - కంచికచర్ల :** బి.సి కార్పొరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు స్వయం ఉపాధి సోపానంనకు ఇంటర్వ్యూలు బుధవారం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న 1,646 మందికి మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు జరగాల్సి ఉంది. మంగళవారం కంచికచర్ల మండలం 14 గ్రామాల్లో 792 మంది దరఖాస్తుదారులకు సంబంధించి 559 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బిఎం లక్ష్మీ కుమారి తెలిపారు. ఎంపిడిఓతో పాటు ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, పలువురు కార్యదర్శులు ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులకు సంబంధించిన ఒరిజినల్స్ పరిశీలించారు. బుధవారం కంచికచర్ల, బత్తినపాడు గ్రామాల్లో రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు. బ్యాంకుల ప్రతినిధులు అందరూ హాజరు కాకపోవడం విశేషం. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఇంకా ప్రకటించలేదు.

**వత్సవాయి :** బుధవారం అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, లింగగూడెం, కొళ్లికుల్ల, ముండ్లపాడు, సాయంత్రం సుబ్బయిగూడెం, శనగపాడు, నవాబుపేట, తోటచర్ల, కొనకంచి, వెంగనాయకునిపాలెం, వెంకటాపురం గ్రామాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపిడిఓ శ్రీను తెలిపారు. మొత్తం 617కు గానూ 461 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. మండలంలోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామ పిఎస్‌లు, వెల్ఫేర్, డిఎలు పాల్గొన్నారు. ఎంపిపి మార్కపూడి గాంధీ, వైస్ ఎంపిపి గుంటుపల్లి శ్రీనివాసరావు (వాసు) కార్యక్రమాన్ని పరిశీలించారు.

## ఎంఎల్ఎ వసంత జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి - మైలవరం :** స్థానిక ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ జన్మదిన వేడుకలను బుధవారం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక నితీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయం, బోసు బొమ్మ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. **రెడ్డిగూడెం :** శ్రీరాంపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో జరిగిన వేడుకల్లో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు నాదెండ్ల చెన్నకేశవరావు పాల్గొన్నారు. టిడిపి యువ నాయకుడు బొమ్మిన కోటేశ్వరరావు ద్వారా ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ కార్యాలయంలో నిరుపేదలైన ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు చాపమడుగు చంద్రం, టిడిపి యువ నాయకులు తేజ, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## 11 నుంచి బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుండి 16 వరకు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో తిరుమలగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని, శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని యాత్రికులకు మంచినీళ్ళ అందించాలని, కళ్యాణం అందరూ చూసేలా పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్, గ్రామస్తులు, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కెటిపిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## నందిగామలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ మండల పరిధిలో రోజురోజుకి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. బుధవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రతకు నందిగామలో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గురువారం నందిగామలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## సత్తెమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి - నందిగామ :** అంబారుపేటలో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో గెల్లి హరి గోపీనాథ్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు లు సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చక స్వాములు నందిగామ సుబ్బారావు శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

## 13న అండర్ - 11 చెస్ పోటీలు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** 13న పోరంకిలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో ఎస్.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా అండర్ - 11 బాల బాలికల ఛాంపియన్‌షిప్, ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరుగుతుందని టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ - 11 చెస్ చాంపియన్ షిప్‌లో బాల బాలికల విభాగంలో మొదటి రెండు స్థానాలలో నిలిచిన వారిని మేలో జరిగే అండర్ - 11 స్టేట్ టోర్నమెంట్‌కి ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రతి ఏజ్ గ్రూప్‌లో అండర్ 9, అండర్ 11 విభాగంలో మొదటి రెండు స్థానాలకు ప్రత్యేక బహుమతులున్నాయని అన్నారు. దీనితో పాటు ఎస్ఆర్ఆర్ ఇన్విటేషన్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. ఈ ఓపెన్ టోర్నమెంట్లో టాప్ 3 ప్లేసెస్‌కు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఏజ్ గ్రూప్‌లో మొదటి రెండు స్థానాలకు ప్రత్యేక బహుమతులు న్యాయన్నారు. ఈ టోర్నమెంట్ ఆడేవారు శనివారం సాయంత్రం ఆరు గంటల లోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని టోర్నమెంట్ డైరెక్టర్ రేణుక తెలిపారు. మరిన్ని వివరాలకు 9700775220/ 9247153387 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## వక్ఫ్ చట్ట సవరణతో మైనార్టీలపై దాడి : సిపిఐ

**ప్రజాశక్తి - తిరువూరు :**

వక్ఫ్ బోర్డు ఆస్తుల చట్ట సవరణ మైనారిటీలపై దాడిచేయటమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో తిరువూరు మెయిన్ రోడ్డు ఎస్‌డి మార్టు వద్ద వక్ఫ్ బోర్డు ఆస్తుల చట్ట సవరణను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను, లౌకిక రాజ్యాంగాన్ని, పౌర హక్కులకు తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. కొంతమంది ముస్లింలు తమ ఆస్తులను అల్లాకు (వక్ఫ్‌బోర్డుకు) దానం చేస్తే ఆ భూములను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు వక్ఫ్ బోర్డు ఆస్తుల చట్ట సవరణ చేసిందని అన్నారు. ఇదీ ముస్లిం మైనా రిటీలపై పరోక్షంగా దాడిచేయటమేనన్నారు. దీన్ని లౌకిక వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, నియోజక వర్గ కార్యదర్శి షేక్.నాగుల మీరా, నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తపై లైంగిక వేధింపుల పట్ల నిరసన



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ బహుజన దళిత ఐక్యవేదిక నాయకులు

**ప్రజాశక్తి - విస్సన్నపేట :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ కంకనాలపల్లిలో అంగన్వాడీ టీచర్‌పై టిడిపి నేత లైంగిక వేధింపులను ఖండిస్తూ బుధవారం కెవిపిఎస్, బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా ఆమె అగ్రవర్ణాల కులానికి చెందిన వాడినని టిడిపి నేత లైంగిక వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞాన రత్నం సిఐటియు విస్సన్నపేట మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు సిపిఎం మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు, బహుజన దళిత ఐక్యవేదిక నాయకులు పల్లెపాం లక్ష్మయ్య ముంగా జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్, ఐదో తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - ఎ.కొండూరు :**

ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకులం కృష్ణారావు పాలెం పాఠశాల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష (ఏపీ బి ఆర్ ఏ జి సెట్) ఏప్రిల్ 13న ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ కె.సిద్దయ్య తెలిపారు. ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులందరూ హాల్ టికెట్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్)తో పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపల్ కె.సిద్ధయ్య తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను వెబ్సైట్ నుండి లేదా ఫోన్ నెంబర్ 9704550060 ను సంప్రదించాలని సిద్దయ్య కోరారు.

## 13న గురుకుల ప్రవేశ పరీక్ష

**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో (డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలు) 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్-13న ఆదివారం జరుగుతుందని ప్రిన్సిపాల్ తబిత తెలిపారు. ఏప్రిల్-13 వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను https:// apbragcet. apcfss.in/ వెబ్‌సైట్ నుంచి పొందొచ్చన్నారు. హాల్ టికెట్, ఏదైనా ఒక గుర్తింపు కార్డు తో పరీక్షకు హాజరు కాగలరని ఆమె తెలిపారు.

**తిరువూరు :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలోని తిరువూరు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. 13న ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని చెప్పారు.

## ఆర్థికసాయం

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను కార్యాలయంలో వ్యక్తిగత సిబ్బందిగా పనిచేసిన జగ్గయ్యపేట పట్టణానికి చెందిన పెగళ్ళపాటి శ్రీనివాస్ (సిఎంఆర్ఎఫ్ శ్రీనివాస్) కొంత కాలం క్రితం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు ఆర్థిక ఇబ్బందులను గ్రహించి, సామినేని ఉదయభాను తన సొంత నిధులు రూ.లక్ష శ్రీనివాస్ తండ్రి పెగళ్ళపాటి మోహనారావుకు అందజేశారు. ఉదయభాను మాట్లాడుతూ చిన్న మృతిచెందడం బాధకరమన్నారు. ఆయన వెంట అడ్వకేట్ ఈశ్వరప్రగడ వెంకట జగన్నాధరావు, కీసర రాంబాబు, శ్రీనివాసరావు, అడ్వకేట్ సామినేని రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి అందరి అభిమతం కావాలి

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :**

ప్రపంచ శాంతి ప్రజలందరి అభిమతం కావాలని అదే జైన మతం బోధిస్తుందని ప్రముఖ జైనగురువు ఆచార్య దేవేష్ శ్రీమద్ విజయ్ కుల్బోధి సూరీశ్వర్జీ అన్నారు. జైన సంఘాల అనుబంధ సంస్థ జీతో విజయవాడ ఛాప్టర్ ఆధ్వర్యంలో ప్రపంచ నవకర్ మహామంత్ర దినోత్సవాన్ని విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ప్రపంచ వ్యాపితంగా పలు నగరాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జైనగురువు ఆచార్య దేవేష్ శ్రీమద్ విజయ్ కుల్బోధి సూరీశ్వర్జీ మాట్లాడుతూ అన్ని జీవుల పట్ల ప్రేమను కలిగి ఉండాలని ఆయన ఉద్బోధించారు. సంస్థ విజయవాడ చాప్టర్ ఛైర్మన్ కమలేష్ ఫోలముతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రాకేష్ జైన్, ప్రధాన కార్యదర్శి మనీష్‌జైన్, కోశాధికారి కుందన్మల్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంకా దినకర్

## అర్హులందరికీ పథకాలను అందించాలి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు

చైర్మన్ లంకా దినకర్

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటి అభివద్ధి ఫలాలను అర్హులైన పేద ప్రజలకు అందించేందుకు అధికారులందరూ సమన్వ యంతో పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ ఆదేశించారు.స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో బుధవారం చైర్ పర్సన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబందించిన అంశాలపైన సంబంధిత శాఖల అధికారులతో సంక్షించారు. మచిలీపట్టణం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ మట్టా ప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సమీక్షలో ప్రధానంగా ఉపాధిహామీ పథకం ప్రస్తుత అమలు తీరు, బందరు పోర్ట్ నిర్మాణం పురోగతి, పోర్ట్ ఆధారిత ప్రాజెక్టుల అవసరంపైన సమీక్ష జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, బందరు ఆర్డీవో కే స్వాతి, మచిలీపట్నం ఉత్తర, దక్షిణ మండల తహసిల్దార్లు నాగభూషణం, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

## నేటి నుండి కళ్యాణ మహోత్సవాలు

**ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండలం గూడూరు గ్రామంలో ఉన్న శ్రీ వేంకటాచల స్వామివారి దివ్య కళ్యాణ మహొత్సవ కార్యక్రమాలు గురువారం నుండి 14 సోమవారం వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహనరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ తిమ్మరాజు కృష్ణకాంత్ తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**ప్రజాశక్తి-గన్నవరం :** ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు బుధవారం బొమ్ములూరు గ్రామంలో జరిగింది. సర్పంచ్ విజయభాస్కర్ మాట్లాడుతూ ఆర్గానిక్ వ్యవసాయం చెయ్యడం వలన కలిగే లాభనష్టాలు వివరించారు. ఆసక్తిగల వారికి డిపార్ట్మెంట్ నుండి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి. ఓ లు గుల్లపల్లి అనంత లక్ష్మీ, పచిగల్ల జ్యోతి, టీడీపీ పార్టీ సెక్రటరీ గుల్లపూడి ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు యర్రంశెట్టి బాబీ, రైతులు పాల్గొన్నారు.

# ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు కృషి : కలెక్టర్

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి అంగీకారంతో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు కషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులు, ఆర్డీవోలతో సంయుక్త సమావేశం నిర్వ హించి పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం మేరకు అనువైన చోట ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మోడల్ ప్రైమరీ స్కూల్ం-ఎం పి ఎస్) ఏర్పాటు చేయవలసి ఉందన్నారు.విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి మండలానికి కనీసం 3 లేదా 4 ఆదర్శ పాఠశాలల ఏర్పాటుకు కషి చేయాలన్నారు. ఇందులో భాగంగా గతంలో మాదిరి విద్యార్థుల తల్లిదండ్రులు అందరితో సమావేశం నిర్వహించకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి చదువు కుంటున్న విద్యార్థుల ఇంటింటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ఒక మంచి తరుణమని, 1,2 తరగతులు ఎలాంటి మార్పు జరగ కుండా అదే ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతాయని,


మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయులు ఉండటం వలన చక్కగా చదువుకుంటారని అవగాహన కలిగించాలన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోయే ఒక ప్రక్రియ అని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పర్యటించేటప్పుడు సచివాలయ సిబ్బందిని, మండల ప్రత్యేక అధికారులను, ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని అనుకున్న లక్ష్యాన్ని సజావుగా నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, డి ఈ ఓ పివిజె. రామారావు, కె ఆర్ సి కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం ఉయ్యూరు ఆర్ డి ఓ లు కె. స్వాతి, బిఎస్ హేలా షారోన్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు పాల్గొన్నారు.


చల్లపల్లి మండలంలో...

## పౌష్టికాహారంపై అవగాహన

**ప్రజాశక్తి-చల్లపల్లి :** ఈనెల 8వ తేదీ నుండి 22 వరకు మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూపర్వైజర్ సిహెచ్ ఆదిలక్ష్మి తెలిపారు. నారాయణరావు నగర్ మోడల్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పట్వాడాపై గర్భవతులు, బాలింతలు, సంరక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు గర్భవతి అయిన దగ్గర నుండి ప్రసవించే వరకు వెయ్యి రోజులు సంరక్షణ గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టిహకారం, వ్యక్తిగత పరిశుభ్రత, గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా కానిస్టేబుల్ సైకం నాగలక్ష్మి, ఆశ వర్కర్ సీతారామమ్మ, అంగన్వాడీ కార్యకర్తఎస్. కె. ముంతాజ్ బేగం, సహాయకురాలు ఏ.లలిత తల్లులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** పోషన్ పక్వాడ పక్షోత్సవాల వేడుకలు మండలంలోని గండిగుంట గ్రామంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కంకిపాడు ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజినీ అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భిణీలకు మొదటి వెయ్యి రోజులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమాలు సీఎంఏఎం అమలు చేయడం ద్వారా పిల్లల పోషణ లోపాలను నివారించవచ్చని అన్నారు.పిల్లల ఉబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవన జీవనశైలి పట్ల తల్లులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండల కేంద్రంలోని సచివాలయంలో పౌష్టికాహార వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి మాట్లాడుతూ పౌష్టికాహారం సక్రమంగా పిల్లలకు అందాలంటే మొదటి 1000 రోజులు గర్భస్థ దశ నుండి రెండు సంవత్సరాల వరకు సంరక్షణపై శ్రద్ధ వహించాలని అన్నారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం ద్వారా పిల్లలలో పౌష్టికాహార లోపం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లు శ్రీలక్ష్మి , వరిగంజి శశి రాజ కళ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

## ఇంటర్వ్యూలకు 576 మంది హాజరు

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఈ బీసీ కార్పొరేషన్ల వారికి సబ్సిడీ రుణాల కోసం ం 1040 మంది దరఖాస్తులు చేసుకోగా లబ్ధిదారులకు బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 576 మంది హాజరైనట్లు ఎంపీడీవో ఎం మర్యాద దేవి తెలిపారు. మండలానికి మొత్తం 104 యూనిట్లు మంజూరు కాగా మరో మూడు మోటార్ వాహనాలకు సంబంధించిన యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రామకష్ణంరాజు, ఎస్బిఐ ఎడిబి మేనేజర్ ఎం రమ్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి వినిల్ వరుణ్, ఇండియన్ బ్యాంకు మేనేజర్ రవితేజ పాల్గొని లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు.

## నాగాయలంక-నరసాపురం బస్సు రూటు మార్పు

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** నాగాయలంక నుండి నరసాపురం వెళ్లే బస్సు సర్వీస్ రూటు గురువారం నుండి మార్పు చేస్తున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. గతంలో ఆకివీడు బంటుమిల్లి మీదుగా వెళ్లే సర్వీస్ను బంటుమిల్లి, కత్తివెన్ను, పల్లెపాలెం లో సరి భీమవరం మీదగా నరసాపురం వెళ్లి తిరిగి అదే రూట్లో బయలుదేరి నాగాయలంకకు చేరుతుందని తెలిపారు. ఈ మార్పును ప్రయాణీకులు గమనించాలని డిపో మేనేజర్ కోరారు. అదేవిధంగా ద్వారకాతిరుమలకు నడుపుతున్న ఎక్స్ప్రెస్ బస్సు వేళాలందు కూడా స్వల్ప మార్పులు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ద్వారకాతిరుమల నందు ఉదయం 10:30కు బయలుదేరుతున్న సర్వీసు గురువారం నుండి 11 గంటలకు బయలుదేరి వస్తుందని చెప్పారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - గుడివాడ :** బిసిల ఐక్యతకు, బలోపేతానికి కృషి చేసిన దేవరపల్లి కోటికి మళ్ళీ గుడివాడ డివిజన్ శ్రీ సాయి నాయీ బ్రహ్మణ సంక్షేమసేవా సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని మాజీ అధ్యక్షుడు వికృతి పోతురాజు అన్నారు. బుధవారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీదేవరకొండ నాగన్న సత్రంలో గుడివాడ డివిజన్స్థాయి శ్రీ సాయి నాయీ బ్రహ్మణ సేవా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ స్థాయి అధ్యక్షుడిగా దేవరపల్లి కోటి, ప్రధాన క్యాదర్శిగా చిర్లపు దుర్గారావు, కోశాధికారిగా వికృతి సత్యం, గౌరవ అధ్యక్షుడిగా వికృతి పోతురాజు, సలహాదారుడిగా కొల్లి రాఘవయ్య, ఉపాధ్యక్షులుగా తేనేటి వెంకటప్రాణేశ్వరరావు, మణేశ్వరరావు, కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, రాఘవయ్య, సత్యనారాయణ, తదితరులు ఎన్నికైయ్యారు. ఎన్నికైన నూతన కమిటిని పులువురు పూలమాలలతో సత్కరించారు.

## గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

**ప్రజాశక్తి-పమిడిముక్కల :** అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడి సూపర్వైజర్ ఎం. ఝాన్సీరాణి అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలోని ఎన్టీఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం పూట పాఠశాల నిర్వహిస్తూ గర్భిణీలకు గుడ్లు, పాలు అందజేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ఆటలు, తెలుగు, ఇంగ్లీష్ పదాలు నేర్పాలని అన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ విజయనిర్మల, గర్భిణులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాల సభ్యులను పరామర్శిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్, మండలి వెంకట్రామ్

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండలంలో పలు కుటుంబాలను ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి వెంకట శ్రీనివాస్ పరామర్శించారు. ఇటీవల మోదుమూడి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కొత్తపేట వద్ద కష్ణా నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నదిలో మునిగి మరణించారు. బుధవారం శ్రీనివాస్ మోదుమూడి గ్రామ వెళ్లి మతుల కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలియజేశారు. అతి చిన్న వయసులోనే యువకులు మరణించడం పట్ల విచారణ వ్యక్తం చేశారు. అదేవిధంగా అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని బంధలాయి చెరువు గ్రామానికి చెందిన సింహాద్రి శ్రీనివాసరావు బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఆకస్మికంగా మతి చెందారు. ఇది తెలిసిన శ్రీనివాస్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. కాగా అశ్వరావు పాలెం గ్రామానికి చెందిన రేపల్లె సూర్యనారాయణ పక్షవాతం కారణంగా మతి చెందగా మతుని కుమారుడు రేపల్లె నాని తోపాటు కుటుంబ సభ్యులను శ్రీనివాస్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన సోదరుడు విక్కు ర్తి రాంబాబు, న్యాయవాది విక్కు ర్తి రామకష్ణ, పులి గడ్డ చంద్ర, రేపల్లె ముసలయ్య పాల్గొన్నారు

**ప్రమాద సంఘటన ఆవేదన కలిగించింది : మండలి వెంకట్రామ్.**

కొత్తపేట నది వద్ద ఇటీవల జరిగిన ప్రమాద సంఘటన తీవ్ర ఆవేదన కలిగించిందని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ విచారం వ్యక్తం చేశారు. మోదుమూడి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం అవనిగడ్డ శివారు కొత్తపేట వద్ద కష్ణా నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నదిలో మునిగి మతి చెందడంపై బుధవారం మోదుమూడి వెళ్లి మతుల తల్లిదండ్రులను పరామర్శించారు. వారి బిడ్డల మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఈ కార్యక్రమంలో కోడూరు డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, జనసేన గ్రామం పార్టీ కన్వీనర్ బచ్చు వెంకటనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షులు బచ్చు నాగమల్లేశ్వరరావు, కూటమి నాయకులు బచ్చు శ్రీహరి పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

## నాగార్జున విద్యార్థులకు ర్యాంకులు

**ప్రజాశక్తి - తిరువూరు :** గోదావరి తెలుగు హిందీ ప్రతిభ పరీక్షలో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. 2024- 25 విద్యా సంవత్సరంలో పాఠశాలలో జరిగిన తెలుగు, హిందీ ప్రతిభ పరీక్షల్లో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ కె.నరసింహారావు బుధవారం తెలిపారు. తెలుగు ప్రతిభా పరీక్షలో జి.వాసవి శర్వాణి (8వ తరగతి) రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రూ.500లు నగదు బహుమతి మెడల్, మెమొంటో, సర్టిఫికెట్ సాధించిందని చెప్పారు. హిందీ ప్రతిభ పరీక్షల్లో ఆర్.చైతన్య (8వ తరగతి) రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి రూ.450 నగదు బహుమతి, మెడల్, మెమొంటో సర్టిఫికెట్లు సొంతం చేసుకుందని పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, చైర్మన్ డి.హనుమంతరావు, డైరెక్టర్స్ కె.శేషగిరిరావు, టి.సూరిబాబు, వైస్.ప్రిన్సిపాల్ ఆర్.సురేష్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

## శ్రీవాహిణి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అవార్డు

**ప్రజాశక్తి - తిరువూరు :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ప్రతిభ అవార్డు 2025కు తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలోని ఇద్దరు సహాయ ఆచార్యులకు నేషనల్ ప్రతిభ అవార్డు లభించింది. ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ప్రతి ఏటా ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉత్తమ ప్రతిభచూపిన వారికి జ్ఞాపిక, అవార్డులతో ప్రోత్సహిస్తుంది. ఈ అవార్డుకు కళాశాలకు చెందిన తొర్లపాటి వెంకటేశ్వరరావు, తాడి ప్రసాద్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 13న గుంటూరులో ప్రతిభ అవార్డు ప్రదానం చేస్తారని వివరించారు. ఈ అవార్డులకు ఎంపికైన ఇరువుర్ని ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల యాజమాన్యం, డీను, వివిధ విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.



## ఐఎన్‌టిఎస్‌ఒలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - జగ్గయ్యపేట :** పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో జరిగిన ఐఎన్‌టిఎస్ ఇండియన్ నేషనల్ టాలెంట్ చర్చ్ ఒలంపియాడ్ లెవెల్ 2 పరీక్షల్లో మొదటి బహుమతి టిఎబి కందెబోయిన శరన్ (ఏడో తరగతి) తృతీయ బహుమతి సిహెచ్ సాత్విక్ (ఆరో తరగతి), వి కీర్తన (8వ తరగతి), నాలుగో బహుమతి ఫరీదా 9వ తరగతి సాధించారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వంగూరి కృష్ణ, విజిఎం మురళీకృష్ణ, ఆర్ఐటి వినోద్, డీన్ కె.లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ షేక్ నాగుల్ మేర ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## ట్యాంకర్లతో మంచినీరు పంపిణీ

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ 14 వ వార్డులో నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి బుధవారం మంచినీటి ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరు అందజేశారు. స్థానికులతో మాట్లాడుతూ ట్యాంకర్ దగ్గర మంచినీరు నింపుకు నేందుకు వచ్చిన వారితో నీరు వృథా చేయొద్దని సూచించారు.



# ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌తో సంపద సృష్టి

### క్విజ్‌లో ఆపరేషన్స్ మేనేజర్ సచిన్ రవి

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** విత్త నిర్వహణ ద్వారా సంపదను సృష్టించి ఆర్థికాభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలని ఆపరేషన్స్ మేనేజర్ సచిన్ రవి విద్యార్థులకు సూచించారు. పిబి సిద్ధార్థ కళాశాలలోని ఎంబిఎ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఫైనాన్షియల్ క్విజ్ కార్యక్రమంలో సచిన్ రవి పాల్గొని క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల్లో ఉన్న యువతను చైతన్యపరచి విత్త నిర్వహణలో ప్రావీణ్యం పొందేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో వారిని మంచి మదుపరులుగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. క్విజ్ నిర్వహణలో పిబి సిద్ధార్థ కళాశాల నుండి ఎంబీఏ, బీకాం, బీబీఏ విద్యార్థులు సుమారు 300 మంది ఆసక్తిగా పాల్గొన్నారు. మొత్తం 90 బృందాలు పాల్గొనగా ఆరు బృందాలను ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేశారు. ఫైనల్స్‌లో ఆరు బృందాలు పోటీపడగా విద్యార్థులు షేక్ షాహిన్, ఎస్.భాను మేఘన, బి.వి.ఎం. రోహిత్‌లు 120 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే రెండో స్థానాన్ని రవిరాజ్ జడేజా, అక్షయ్ జైన్, నేహ కైవసం చేసుకున్నారు. మూడో స్థానంలో నిఖిల్ రాజు, కె.సరోజ, ఆర్.జెస్సీ ఫ్లోరా నిలిచారని కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతలకు రూ.12వేలు, రెండో స్థానంలో నిలిచినవారికి రూ.9వేలు, మూడొవ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు నగదు బహుమతులను ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.బి.రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎండీఎస్ రహమాన్, ఎ.ఎస్.ఎన్. లక్ష్మీ, డాక్టర్ కె.ఎస్. అరుణ్ కుమార్, వి.సుజిత పద్మినీ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సచిన్ రవి, కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్, తదితరులు

# ఉర్రూతలూగించిన సిద్ధార్థ స్వర్ణోత్సవ సాంస్కృతిక హేల

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** ఆరోగ్యకరమైన జీవనశైలితోనే పురోగతి సాధ్యమని, నూతన శతాబ్దంలో నైపుణ్యాలు, సృజన, బహుముఖ ప్రజ్ఞ పెంపొందించుకున్నవారికే భవిష్యత్ ఆశాజనకంగా ఉంటుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు అన్నారు. బుధవారం విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వర్ణోత్సవ వార్షిక దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా.గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆందోళన, ఒత్తిడి జయించాలని, ఆర్థిక అక్షరాస్యత, సామాజిక, సాంకేతిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని సూచించారు. సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి అయిన వైస్ చాన్సలర్ డాక్టర్ గంగాధరరావును సిద్ధార్థ అకాడమీ సత్కరించింది. గంగాధరరావు, అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను విజయవాడ వాసులకు అందుబాటులోకి తేవడంలో సిద్ధార్థ కళాశాలలు విజయ సంతకం చేశాయన్నారు. కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యప్రణాళికకే పరిమితమవ్వకుండా గ్రంథాలయాలకి వెళ్ళే అలవాటు పెంపొందించుకోవాలని, ఏ.ఐ. పరిజ్ఞానం కూడా అందిపుచ్చుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.మేకా రమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకటేశ్వర్లు వార్షిక నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు స్వర్ణపతకాలు బహూకరించారు. విద్యార్థులు దాదాపు 3 గంటలపాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తించారు. శ్రీనివాస కళ్యాణం, చందన చర్చిత, కోలాటం, వందేమాతరం, ఢమరుకం, జానపద సంగీతం, జానపద నృత్యాలు, కాంతార, కాంచన తదితర అంశాలతో సిద్ధార్థియన్లు అలరించారు.



మాట్లాడుతున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ గంగాధరరావు

# అమ్రిత సాయిలో టెక్నో సైబర్ ఫెస్ట్

**ప్రజాశక్తి - కంచికచర్ల :** కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో టెక్నో-సైబర్ ఫెస్ట్ అసిస్ట్ ఆహ్వాన్ 2కె25ను నిర్వహించామని సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామ మోహన రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు వారిలోని విజ్ఞానానికి సృజనాత్మకతను జోడించి నూతన ఆవిష్కరణలను రూపొందించవచ్చన్నారు.. ఈ విధంగా వారు దేశ సాంకేతిక అభివద్ధి లో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుండి ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారన్నారు.. సైబర్ క్యాంప్, ట్రెజర్ హంట్, కోడింగ్ కంటెస్ట్, ఐడియా ఫోర్జ్, పోస్టర్ ప్రెజెంటేషన్స్ వంటి వివిధ సాంకేతిక అంశాల పై పోటీలు నిర్వహించామని తెలియ చేసారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్ మాట్లాడుతూ స్టూడెంట్ యాక్టివిటీ క్లబ్స్ ద్వారా కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఈ టెక్నో సైబర్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. పోటీలలో సైబర్ క్యాంపు విభాగంలో అమ్రిత సాయి విద్యార్థులు వి.చరణ్ ప్రకాష్ టీం సిస్టమ్ హ్యాకింగ్‌లో మొదటి స్థానాన్ని, ఇసిఇ విద్యార్థులు సిహెచ్.బాలాజీ టీం మొబైల్ హ్యాకింగ్‌లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కోడింగ్ కంటెస్ట్‌లో మొదటి స్థానాన్ని మిక్ కలాశాల ఐటి బ్రాంచ్ విద్యార్థులు పాల్ జొనాథన్, కె. ధను వెంకటేష్, ఎస్‌కె ఇషాక్, రెండవ స్థానాన్ని అమ్రిత సాయి కళాశాల సిఎస్‌ఇ విద్యార్థులు బి.జీవన్ కుమార్, బి.తులసి రామ్ కైవసం చేసుకున్నారు. ఐడియా ఫోర్జ్ విభాగంలో అమ్రిత సాయి సీయస్డీ విద్యార్థులు ఎన్ నరేంద్ర, గోపాల కృష్ణ మొదటి స్థానాన్ని, మహారాష్ట్ర పూణే కు చెందిన విద్యార్థులు ధీమన్, జైన్,శర్మ, వైభర్ రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ట్రెజర్ హంట్ విభాగంలో అమ్రిత సాయి మొదటి సంవత్సరం విద్యార్థులు ఎస్కె ఆషిక్ పాషా ఈఈఈ విభాగం విద్యార్థి త్రినాధ్ మొదటి స్థానాన్ని, అమ్రిత సాయి రెండవ సంవత్సరం ఇసిఇ విద్యార్థులు ఎం,వెంకటేశ్వర రావు, ఎస్.ప్రవీణ్‌కుమార్ రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.




విద్యార్థులకు బహుమతులందజేస్తున్న కరెస్పాండెంట్ మోహనరావు

## నవజాత శిశువులపై ప్రత్యేక దృష్టి సారించండి

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :** నవజాత శిశువుల అనారోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది. బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ, జంగం రాజేంద్ర ప్రసాద్‌లు సందర్శించారు. ఆసుపత్రిలో 3 ఏళ్ళు నుండి నేటి వరకు నమోదైన నవజాత శిశువుల వివరాలు, వారు పొందిన వైద్య విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రుల్లోని నవ జాత శిశువుల విభాగాలను సందర్శించి వాటిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫా రసులు చేయనున్నట్టు చెప్పారు. ఈ పర్యట నలో ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ, వైద్యులు సునీత, అశ్వినీ, ఖ్యాతి, సౌజన్య, ఇన్చార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒగా మాధవరెడ్డి

**ప్రజాశక్తి - తిరువూరు :** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం తిరు వూరు మండల అసిస్టెంట్ ప్రాజెక్టు అధి కారిగా ఎం.మాధవ రెడ్డి నియమితులయ్యారు. ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరుకు ఆయన బదిలీపై రాగా, తిరువూరులో పనిచేస్తున్న నల్లగట్ల మున్నీ ఇబ్రహీంపట్నం బదిలీ అయ్యారు. బుధవారం మాధవరెడ్డి బాధ్యతలు చేపట్టారు.



## 11న సిద్ధార్థ బిబిఎ విభాగం మాగ్నోవా

**ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :** విజయవాడ పి.బి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఈ 11న సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమం మాగ్నోవా పోస్టరును బుధవారం విడుదల చేశారు. వ్యాపార నిర్వహణ, పర్యవేక్షణ అంశాలపై గత రెండు దశాబ్దాలుగా అంతర కళాశాలల పోటీ నిర్వహిస్తున్నామని బి.బి.ఎ. విభాగాధిపతి, డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, ప్రిన్సిపాల్ డా.మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, ఉప విభాగాధిపతి కె.వి.రమేష్ చంద్ర, అధ్యాపకులు డా.కె.శ్రీనివాసులు, కె.విజయ్, పి. కిశోర్, బి.శాలిని పాల్గొన్నారు.

## మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యునిగా కోటేశ్వరరావు

**ప్రజాశక్తి - నందిగామ :** నందిగామ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ గా నియ మితులైన పులవర్తి చిన్న కోటేశ్వరరావు ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము పాల్గొన్నారు.

